కథ

# దివ్యానుభూతి

మంచం అంచుమీద తలవంచుకుని కూర్చుని ఉన్నాన్నేను. ఆ మంచం మీద సగం విచ్చుకున్న మల్లెపూలు, నా జడలో తురుముకున్న గులాబీ తప్ప వేరే పూలేం లేవు ఆ గదిలో. చాలా సింపుల్‌గా నాకు నేను ఏర్పాటు చేసుకున్న పాన్పది.

తలుపు చప్పుడైంది. చక్రవర్తి అడుగుల సవ్వడి వినపడగానే, గుండెలో ఏదో ఉద్వేగం. అతని అడుగులు నన్ను సమీపించేకొద్దీ మనసులో ఏదో చిత్రమైన భావోద్వేగం!

"దివ్యా" పిలుస్తూ, చేతిని నా భుజం మీద వేసాడు చక్రవర్తి. "ఏంటి, సిగ్గా?" అంటూ నా ముఖాన్ని తనవైపుకి తిప్పుకున్నాడు అరచేత్తో. "ఆ భగవంతుడికి నేనంటే చాలా సాఫ్ట్‌కార్నర్...." చెప్పాడు.

"ఏం?" అన్నాను.

"మిస్సై పోయాననుకున్న ఓ గొప్ప వరాన్ని తిరిగి అందించాడు..." నన్ను [illegible] పట్టుకుంటూ- "థాంక్యూ" చెప్పాడు.

అతన్ని అల్లుకోవాలని, చేతులు భుజాల చుట్టూ వేసాన్నేను కూడా.

సరిగ్గా... ఆ క్షణంలో తలుపు మీద చప్పుడైంది! చక్రవర్తి వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా మూడున్నరేళ్ల పాప.

"ఏంటమ్మా?" ఆ పాపని ఎత్తుకుని అడిగాడు చక్రవర్తి.

"నిద్ర రావట్లేదు డాడీ. నువ్వొచ్చి నా పక్కన పడుకోవా ప్లీజ్..." తండ్రి భుజంమీద తలవాల్చి చెప్పింది.

చక్రవర్తి వెనుకే గుమ్మం దాకా వచ్చిన నేనా మాటల్ని విన్నాను. చక్రవర్తి నా వైపు చూశాడు.

"ముగ్గురం ఈ గదిలోనే పడుకుందాం రామ్మా..." పాపను అందుకోవాలని చేయి చాచాను. నా వంక అయిష్టంగా, ఏదో తలుపునో, గోడనో చూసినట్టు చూసింది పాప. "రామ్మా" మళ్లీ అడిగాను. అప్పుడా పాప చప్పున అనేసింది-"ఉహు. నువ్వొద్దు. పో. నేను డాడీ దగ్గరే పడుకుంటా"

★★★

పదేళ్ల క్రితం-

బాపట్ల అగ్రికల్చరల్ కాలేజ్‌లో బి.యస్సీ, ఎజీ చదివేటప్పుడు నా క్లాస్‌మేట్ చక్రవర్తి. కాలేజ్ మ్యాగజైన్‌లో అతను రాసిన ఓ చిన్నికథ నాలో అతడంటే ఆసక్తి రేపింది. అది చాలా త్వరత్వరగా ప్రేమై ఎదిగింది. అతని మాటలు, అతని రూపం, అతని చూపు....అన్నీ నాలో ఓ కాంతినీ, తీపినీ నింపేవి. మామూలుగా సాగిపోతున్న జీవితానికి గొప్ప రుచి చేకూర్చినట్లూ, హృదయంలో ప్రకాశవంతమైన ఓ వెన్నెల కురుస్తున్నట్లూ... అనుభూతి.

ఫైనలియర్ మొదటి సెమిస్టర్ అయ్యాక శలవులిచ్చారు. చక్రి వాళ్ళ ఊరికి బయల్దేరి వెళ్తున్నాడు. శలవులవ్వగానే తిరిగి వస్తాడు. అయినా సరే, ఏదో అతిముఖ్యమైన భాగం నా నుంచి విడిపోతున్నట్లుగా అనిపించింది. అతనికీ అలాగే ఉందని చెప్పాడు. సెమిస్టర్ బ్రేక్‌కి 15 రోజులు శలవులు. ఆ పదిహేను రోజులపాటు అతన్ని, చూడకుండా ఉండటం అనేది చాలా పెద్ద యాతనలా తోచింది నాకు. నాలోని భావసంచలనాన్ని చదివిన వాడిలా, "డోన్ట్‌వర్రీ యార్, ఆబ్సెన్స్ మేక్స్ హార్ట్ గ్రో ఫాండర్ అట. ఈ చిరువిరహం మనలోని ప్రేమను మరింత పెంచేందుకు దోహదపడుతుందే తప్ప వేరే ఏం కాదు" అన్నాడు.

'వేరే ఏం కాదు' అన్న అతని మాట నిజం కాలేదు!

★★★

అతను కాలేజీకి తిరిగి వచ్చింది నేను ప్రేమించిన నా 'చక్రి'గా కాదు. మరో స్త్రీకి భర్తగా!

ఒక ఆదివారం చక్రి తండ్రి మార్కెట్ నుంచి ఇంటికి వస్తుంటే, ఛాతీలో నొప్పి మొదలైంది. ఆ నొప్పితోనే, సైకిల్ ఎలాగో తొక్కుకుంటూ ఇంటి వరకూ వచ్చి, గుమ్మం దగ్గర పడిపోయాడు.

హాస్పిటల్‌లో అది హార్ట్‌ఎటాక్‌గా నిర్ధారణ అయింది. "48 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచి నిలకడైతేగానీ ఏమీ చెప్పలేం. థ్రాంబొలైజ్ చేసాం, డేమేజ్ బాగా ఎక్స్‌టెన్సివ్‌గానే అయ్యింది. చూద్దాం, ట్రస్ట్ గాడ్" అన్నారు డాక్టర్లు.

24 గంటలు గడిచాక ఆయన కాస్త స్పృహలోకి వచ్చారు. "చక్రీ, నా టైమైపోయింది. డాక్టర్లేదో అంటున్నారుగానీ నాకు నమ్మకం లేదు. ను...నువ్వు మన సుకన్యను పెళ్ళి చేసుకోవాలిరా. ఈ ప్రాణం గాలిలో కలిసిపోయేలోగా మీ ఇద్దర్నీ పెళ్లిపీటల మీద చూడాలి..." హాస్పిటల్ బెడ్‌మీదే అనూహ్యంగా ఆ విషయాన్ని కదిపాడాయన. చక్రవర్తి హతాశుడయ్యాడు.

చక్రి మేనత్త కూతురు సుకన్య. తండ్రి కోసం, తన ప్రేమను చంపుకుని సుకన్య మెడలో తాళి కట్టాడు చక్రవర్తి.

ఇదంతా నాకు వివరించి, "..చూస్తూ చూస్తూ ఆయనతో మన విషయం చెప్పలేకపోయాను. ఇది తెలిస్తే బాగా షాకై మానసిక ఆందోళనకు గురై ఏదైనా జరగకూడనిది జరుగుతుందేమోనని భయపడ్డాను. అసలే దెబ్బతిన్న ఆయన గుండె, ఈ ఒత్తిడికి బాగా ఎగ్జైట్ అయి ప్రాణం పోతుందేమోనని భయం..." చెప్పాడు చక్రవర్తి.

నేనేమీ మాట్లాడలేదు. ఏం మాట్లాడను? ఈ పరిణామం నా గుండెనెంత బాధిస్తుందో అతనికెలా చెప్పను. ఏ కార్డియాలజిస్ట్ మాత్రం ఏం చెప్పగలడు ఈ గుండె గాయం గురించి!

"దివ్యా ప్లీజ్. అలా నావేపు చూడకు. తిట్టు. కొట్టు. ఏదో ఒకటి అను. నీ మౌనంతో నన్ను మరింత బాధించకు ప్లీజ్.." చెప్తూ అప్రయత్నంగా చేతిని నా భుజంపై వేశాడు అనునయంగా. అప్రయత్నంగా, అతని చేతిని తీసేసాను! కొన్ని క్షణాలు విభ్రాంతిగా నావైపు చూసాడు.

"పరిస్థితులు అనే కారణం చెప్పి, చాలా సింపుల్‌గా నన్నూ, నా ప్రేమనూ వ..ది..లిం..చుకున్నావ్ చక్రీ! కానీ, ఇక్కడ...ఈ గుండెలో నిండిపోయిన నువ్వూ, నీ రూపం...ప్రాణాలున్నంతదాకా ఇక్కడే ఉంటాయ్. నీవు పెళ్లిపోవడం అన్నది నా ప్రేమను చెదరగొట్టలేదు. దాన్ని వేరెవరిమీదికో బదిలీ చేయనూ లేదు. గో...మ్యాన్...!" కన్నీళ్లనాపుకునే ప్రయత్నమేదీ చేయకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాను.

★★★

దాదాపు ఏడేళ్ల తర్వాతనుకుంటాను. ఒక రోజు హైదరాబాద్‌లో అబిడ్స్ దగ్గర చక్రి కనిపించాడు నాకు. పక్కన సన్నగా పొడుగ్గా ఉన్న ఓ అమ్మాయి ఉంది. "దివ్యా" అంటూ దగ్గరకు వచ్చి పలకరించాడు. "బాగున్నావా?" అడిగాడు.

దానికేం జవాబు చెప్పకుండా "సుకన్యా?" అనడిగాను ఆ అమ్మాయిని చూపించి.

"అవును. నువ్వు ఇక్కడే ఉంటున్నావని తెలిసింది. ఆమధ్య మన క్లాస్‌మేట్ ఉమాశంకర్ చెప్పాడు, నువ్విక్కడ హార్టీకల్చర్ ఆఫీసర్‌గా చేస్తున్నావని. నేను లాస్ట్ ఇయర్ భోపాల్ నుంచి ఇక్కడికి ట్రాన్స్‌ఫరయ్యాను. ఇండియన్ బ్యాంక్‌లో అగ్రికల్చరల్ ఫీల్డాఫీసర్‌గా చేస్తున్నాను. నువ్వెలా ఉన్నావ్? ఉమాశంకరే చెప్పాడు. నువ్వింకా పెళ్లి చేసుకోలేదని. ఒకవేళ దానికి కారణం నేనే అని నువ్వనుకుంటే...ఒక చిన్న విషయం దివ్యా. ప్రేమ జీవితంలో ప్రధాన భాగమే కాని, అదే జీవితం కాకూడదు. ఒకవేళ అదే జీవితం ఐతే, జీవితాన్ని వెలిగించేదీ, మనకు సంతోషాన్నిచ్చేదిగా ఉండాలి! అంతేకానీ, దాని వలన ఉన్న జీవితం వ్యథాభరితం అవ్వకూడదు. వృథానూ అవ్వకూడదు. ఎన్నెన్ని ఎమోషనల్ కార

ణాలూ, సెంటిమెంట్సూ అ  చెప్పుకున్నా అది పెద్ద వివేకవంతమైన ప  కాదని నా ఉద్దేశ్యం. నా మాట విను...''

''ఏయ్! చక్రీ...ఆపావు.. ఏంటి బాగా మాటలు నేర్చినట్టున్నావ్ ఆరే ళ్లలో. ఊరు కుంటే పెద్ద కౌన్సిలింగ్ కార్య మం పెట్టుకు నేటట్టున్నావ్ ఇక్కడే. ఎంత మ ది పిల్లలు?''

''సుకన్యకు మన గు ంచి అంతా చెప్పాను. నువ్వు పెళ్లిచేసు...''

''అబ్బ. అదొదిలెయ్. పి లు?''

''ఇంకో ఆర్నెల్ల తర్వా త అడిగితే 'ఒక్కరు' అని చెప్తాను'' చెప్పా ు.

★★★

సరిగ్గా అప్పుడు అక్కడల కలుసుకున్న నాలుగేళ్లకి మళ్లీ అతను నన  కలిశాడు- డైరెక్ట్‌గా నా ఆఫీసుకే వచ్చి. అ ి ముఖంలో ఏదో అలసట కనిపిస్తోంది న ు. అంతకు ముందు నేనెప్పుడూ చూడని ఒక విధమైన నిర్లిప్తత కూడా.

''హేయ్. ఏంటిలా వచ వ్?'' అడిగాను.

''నిన్ను చూడాలనిపించిం '' చెప్పాడు.

''మీ ఆవిడెలా ఉంది. బా  పాపా?''

''......''

''ఏంటి మాట్లాడవ్ సుకన్యేలా ఉంది?'' అప్పుడు చూసాను చక్రి కళ్లలోని నీళ్లని. ఆ ముఖంలోది అలసట కాదూ ఆవేదనని అప్పుడు తెల్సింది అ ని జవాబు విన్నాక.

''తను చనిపోయింది దివ్యా''

అదిరి పడ్డాన్నేను. ''ఎ.  ఎప్పుడు చక్రీ?'' అడిగాను హతాశురాలి .

''లాస్ట్ డిసెంబర్‌లో''

''ఏం? ఎలా అసలు?''

''ఒక రోజు తలనొప్పి ని పడిపోయింది. స్కాన్‌లో బయటపడి ి. సుకన్యకు, చాలా అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉన్న లోప  ఒకటుందని. దానికా డాక్టర్లు పెట్టిన పేరు ఆర్టెరియో వీనస్ మాల్‌ఫార్మేషన్. అసాధారణమైన జబ్బు. ఇన్నాళ్ల టు ఆమె బ్రతికుండటమే గొప్ప అని చెప్పారు. అ యినా సర్జరీ చేసారు. మూడో రోజుకే హేమరేజ్ వచ్చేసి ంది''

''అయామ్ సారీ చక్రీ. ఇప్పుడు నాకెందుకు కబురు చెప్పలేదు. వచ్చే దాన్ని ..''

''ఇప్పుడు నిన్ను కలవడా కి కారణం తెలుసా దివ్యా. కోమాలోకి వెళ్లిపోయే ము ందురోజు సుకన్య నా దగ్గర ఒక మాట తీసుకు ది...'' క్షణం ఆగి, చెప్పాడు... ''పాపకు తల్లిగా ని న్ను నా ఇంటికి తన స్థానంలో తీసుకురావాలని.''!

క్రింద భూమి కదిలినట్టు ఉ క్కిపడ్డాను. చాలాసేపు ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయ ను. ఆ తర్వాత నోరు విప్పాను.

''పాపా?''

''అవును''


''ఏం పేరు?'' దానికతడు ఓసారి నా కళ్లలోకి చూసాడు. కాలేజీ రోజుల్లో నాక్కనిపించే 'ఆ ప్రేమ' కనిపించింది నాకతని చూపులో. ''పాప పేరేంటి?'' అడిగాను మళ్లీ.

''దివ్య! నీ పేరే. సుకన్య కావాలని పట్టుబట్టి పెట్టింది.''

★★★

జ్ఞాపకాల నుంచి బయటకు వచ్చి, పాప కోసం వెదికాయి నా కళ్ళు. చక్రి మీద కాలు వేసుకుని నిద్ర

గుమ్మడి రవీంద్రనాథ్



పోతోంది బెడ్‌మీద, చాలా సేపు చక్రినీ, 'దివ్య'నీ అలా చూస్తూ ఉండిపోయాను. నిజం చెప్పాలంటే, ఆ పాప మీద జాలితోనే నేను చక్రికి (రెండో) భార్యగా ఆ ఇంటికి రాలేదు. అతని మీదున్న ఆ 'తొలిప్రేమ' తాలూకు తీయదనం నాలో ఇంకా ఇంకిపోలేదు. ప్రాణాలు పోయే దాకా పోదు కూడాను. ఆ ఫస్ట్‌లవ్ సెంటిమెంట్ సన్నిక్కడకు లాక్కొచ్చి ఉంటుందని నా నమ్మకం. కన్యగానే ముగిసిపోతుందనుకున్న నా జీవితం ఇలాంటి అనూహ్యమైన మలుపు తిరుగుతుందని కల్లో కూడా అనుకోలేదు. అదీ ఇలాంటి 'ఇన్‌స్టాంట్ ఫామిలీ'లోకి! హనీమూన్స్ లేవు. తొమ్మిది నెలలు గర్భవతిగా కడుపులో 'నా' బిడ్డను మోసే తీయదనం లేదు. బయటకు వెళ్ళి పసిపిల్లల బట్టల్ని డయాపర్స్‌నీ కొనే ముచ్చట లేదు. భార్య నుండి తల్లిగా మారే ట్రాన్సిషన్ అనుభూతి తెలీదు. వేరెవరికో పుట్టిన బిడ్డను ప్రేమించగలగడం అంత సులభం

కాదా? ఈ చిన్నచిన్న అనుభూతులేవీ అనుభవించకపోవడమేనా దానికి కారణం? సరిగ్గా... అప్పుడు వినిపించింది.

''మమ్మీ! మమ్మీ!''

దివ్య నిద్రలో పిలుస్తోంది! ఆ పాప వాళ్ల మమ్మీ సుకన్యను పిలుస్తోందా లేక నన్నా? నన్నే పిలుస్తున్నట్లుగా అనిపించింది. క్షణంలో సగం సేపు. మనసులో ఎక్కడో ఏదో తెలీని స్పందన. అదీ దివ్య నన్ను, తొలిసారిగా ''మమ్మీ'' అని పిలవడం! 'ఎవరి పేగో తెంచుకుని పుట్టిన బిడ్డైనా, నేను తనను ప్రేమించ గలను' స్థిరంగా అనుకున్నాను.

★★★

దివ్య సుకన్యను అసలేం మర్చిపోలేదు. తన గదిలో, సుకన్య ఫొటోల్ని పెట్టుకుంది. మనవరాల్ని చూడడం కోసం సుకన్య తల్లిదండ్రులు వచ్చారు ఒకరోజు. వాళ్ళు దివ్యతో, ''నీ అంతప్పుడు మీ అమ్మ అచ్చం నీలాగే ఉండేది'' అని చెప్పినప్పుడు, ఆశ్చర్యంగా చూసేది తల్లి ఫొటోల వంక. ఒకరోజు నాతో అంది దివ్య, ''ఈవేళ అమ్మమ్మ నాకు, మమ్మీ తాగే కప్పు ఇచ్చింది బోర్నవీటా''

చక్రి ఎంత ప్రేమగా చూసుకున్నా, తాత అమ్మమ్మలు ఎంత వాత్సల్యం కనపరచినా, దివ్యకి ఒక తల్లి కావాలి.

తోటి పిల్లల్తో ఆడుకుంటూ క్రిందపడి మోచేతులు కొట్టుకుపోతే, ఆ గాయం మీద మందుపెట్టుకునే తల్లి కావాలి!

ఆకాశంలో చందమామను చూపిస్తూ, గోరుముద్దలు తినిపించే తల్లి కావాలి. టీవీలో వచ్చే రాకెట్స్ గురించీ, డైనోసార్స్ గురించీ వివరంగా చెప్పే తల్లి కావాలి. రాత్రిళ్లు ఒళ్లో పడుకోబెట్టుకుని, కామిక్స్ చదివి అర్థమయ్యేలా ఓపిగ్గా చెప్పే తల్లికావాలి.

ఒకరోజు తన ఆటబొమ్మలతో ఆడుకుని, హాల్లోనే అలా వదిలేసింది. అది చూసి కొంచెం కోప్పడ్డాను నేను. నా వంక చాలా ముభావంగా చూస్తూ ''నువ్వు నా నిజం మమ్మీవి కాదు'' అంది దివ్య.

నిర్ఘాంతపోయాను. దగ్గరకు తీసి అనునయంగా చెప్పాను. ''లేదమ్మా. నేను నీ నిజం మమ్మీనే. ఎప్పటికీ నీ మమ్మీనే. నిజం'' అనగానే నా చేతుల్లోకి ఒరిగిపోయి ఏడ్చేసింది!

★★★

దివ్య బాగా పసివయసులో ఉన్నప్పటి ఫొటోలన్నీ చక్రిని అడిగి తీసుకుని చూశాను ఒకరోజు. నెలల పిల్లప్పుడు ఎంతో బొద్దుగా మరీ అందంగా ఉంది. ఆ పసితనపు అమాయకత్వం నేను చూడలేకపోయాను. లేచి నిల్చుని, ఏ గోడ పట్టుకోకుండా తనకు తానుగా మొదటి అడుగు వేసినప్పుడు చూడటానికి నేనులేనే అనిపించింది! బోసినోట్లో పాలపళ్ళు మొలవడాన్ని నేను చూడలేకపోయాను. అసలు అది పుట్టినప్పుడు, బుల్లి బుల్లి పెదాలతో తలమీద కొంచెం జుట్టుతో ఎలా ఉందో ఊహించుకున్నాను. మనసులో లీలగా అసూయలాంటిది కలిగింది. సుకన్య, చక్రీ అప్పుడు పసిగుడ్డును చూసి ఎలా ఫీలై ఉంటారు? అమ్మా నాన్నలమయ్యాం అని ఎలా మురిసిపోయి ఉంటారో!

★★★

రోజులు గడుస్తున్నకొద్దీ, దివ్య గురించి అన్నీ తెలుసుకున్నాను. దానికి పాలల్లో హార్లిక్స్ బాగా ఎక్కువ వేయాలి. ఇడ్లీకంటే దోశ ఇష్టం. బార్బీలతో గంటల తరబడి ఆడటం మరీమరీ ఇష్టం. టీవీలో కార్టూన్ నెట్వర్క్ వస్తే కూర్చుని కదల్దు. తన 'నిజం మమ్మీ'నే బ్రతికుంటే ఎలా ఉండేదో అచ్చం అలాగే మసలుకోసాగాను దివ్యతో. తను ఇదివరకులా నన్ను మరీ వేరుగా చూడటంలేదు. కానీ 'మమ్మీ' అని మాత్రం పిలవడం లేదు! అదే నాకు పెద్దలోటుగా, అసంతృప్తిగా అనిపిస్తోంది.. బాగా!

★★★

ఆ రోజు దీపావళి

అరుగులమీద ప్రమిదలు పెడ్తున్నాను నేను. దివ్య వచ్చి వెలిగే ఆ ప్రమిదల వంక వింతగా చూస్తోంది. కాకరపువ్వొత్తి నొకదాన్ని తీసుకుని ప్రమిదలోని వత్తికి అంటించి, ముందుకు తిరిగి వెలుగుతున్న ఆ కాకరపువ్వొత్తిని చేయి ముందుకు చాచి పట్టుకుంది. పండుగ కోసం నేను కొన్న కొత్తగౌను వేసుకుంది అప్పుడు. ఆ గౌను అంచుదగ్గరున్న లేస్ దీపానికి తగిలి భగ్గున మండింది! కూతురి ముఖంలోని సంతోషాల జ్యోతుల్ని చూస్తున్న చక్రి పక్కనే ఉన్న ఆ మంటను గమనించలేదు. యథాలాపంగా నేనటు చూసేసరికి, కాలిపోతున్న ఫ్రాక్ కనిపించింది. వెంటనే, నా రెండు చేతుల తోనూ మండుతున్న ఆ గౌను అంచుని పట్టుకుని గట్టిగా అదిమిపెట్టి మంటల్ని ఆర్పేసాను! నా కుడిచేతి వేళ్ళు బాగా కాలాయి. అయినా, నాకప్పుడు నొప్పి అనిపించలేదు, దివ్య నా వంక 'ఎవరో పరాయి వ్యక్తి'ని చూసినట్టుగా కాకుండా, తన సొంతమనిషిని చూసినట్టు చూసిన దాని కళ్లలోకి చూడటంతో!

★★★

మే-14, ఆదివారం

నిన్నటిలాగే ఆరోజు కూడా [illegible] రెండుసార్లు వాంతులు చేసుకున్నాను. [illegible] ఉదయం తొమ్మిదైంది. సాయంత్రం వెళ్లి, కన్ఫర్మ్ పరీక్ష చేయించుకోవాలనుకున్నాను. ఆ విషయం ఇంకా చక్రికి కూడా చెప్పలేదు.

చాలా సేపట్నుంచి దివ్య తన గదిలో నుంచి బయటకు రాలేదు అన్న ఆలోచన అప్పుడొచ్చింది నాకు. ఏదో అనుమానం వచ్చి, గబగబా సోఫాలోంచి లేవబోయాను వెళ్ళి చూద్దామని . ఇంతలో అనూహ్యంగా నా వెనుకనుంచి ఎవరో వచ్చిన అలికిడైంది. వెనక్కు తిరగబోయేలోపే నా కళ్లను ఎవరో మూసేసారు! ఆ స్పర్శ.. ఆ లేతవేళ్లనీ బట్టి అది దివ్య అని అర్థమైంది. ఆశ్చర్యపోయాను. ఎప్పుడూ, తను అంత చనువుగా, అంత సన్నిహితంగా నాతో మసలలేదింతవరకూ.

''నా బంగారు తల్లీ...నా నేమ్మేట్...నాకు తెల్సిపోయిందిలే'' అన్నాను, మృదువుగా కళ్లమీద చేతుల్ని విప్పి. ఆ పాప చేతిలో తనే స్వయంగా చేసిన బొకే ఉంది. బంతిపూలు, గులాబీలతో చేసిన పూలగుచ్ఛం. దాన్ని నాకందిస్తూ చెప్పింది దివ్య ''హేపీ మదర్స్ డే మమ్మీ!'' శరీరమంతా ఒక రకమైన పులకింతతో చలించిపోయింది నాకు. ఉదయాన్నే తనేవెళ్లి దొడ్లోని పూలని కోస్తుంటే ఎందుకో అనుకున్నాను. తన గదిలో కూర్చుని, పొద్దున్నుండీ క్రెయాన్సూ అవీ ముందరేసుకుని తనే తయారుచేసినట్టుంది. ఒక చక్కటి గ్రీటింగ్ కార్డ్ని కూడా బొకేతో కలిపి ఇచ్చింది. నా కన్నుల్లోకి చివ్వున నీళ్ళు ఊరిపోయాయి. గభాల్న దివ్యను దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకున్నాను. బుగ్గలమీద నిర్విరామంగా ఆ పసిముఖాన్ని ముద్దుపెట్టుకుంటున్నాను. మరొక స్త్రీకి పుట్టిన బిడ్డను ప్రేమించగలగటం కష్టమని భావించాను ముందు. కానీ ఇప్పుడు తెలుస్తోంది, చాలా సహజసిద్ధంగా, మా ఇద్దరి మధ్య 'తల్లీకూతురు అను బంధం' ఉద్భవించిపోయిందని! నేనెన్ని ముద్దులు పెట్టుకుంటున్నానో, అన్నీ దివ్య కూడా నాకిస్తోందని అర్థమవగానే అరిపాదంలో మొదలై శరీరమంతా చుట్టేసింది ఓ 'దివ్యా'నుభూతి!! మనసు లోతుల్లో ఎక్కడో ఒకచోట అనిపిస్తూనే ఉంది నాకు ఇంతగా ఆ పాపమీద ప్రేమ పెరగడానికీ ఇలా భావోద్వేగానికి గురవడానికీ...కాలేజ్ రోజుల్లో 'చక్రి' పైన నా హృదయంలో కలిగిన స్వచ్ఛమైన ఆ తొలిప్రేమే పునాదేమోనని!! ఒక్కటి మాత్రం గట్టిగా నిర్ణయించుకున్నాను. ఎట్టి పరిస్థితులలోనూ నాకు పుట్టబోయే బిడ్డనీ, దివ్యనీ సరిసమానంగా చూసి తీరాలని. లేదంటే 'అమ్మ' అన్న పదానికి అర్థమే లేదని.

★

